సాక్షి ఒడిశా

మంగళవారం। 15। ఏప్రిల్। 2025



రక్తదానం.. ప్రాణదానం

మల్కన్‌గిరిలో పోలీసులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 103 యూనిట్ల రక్తం సేకరించారు. - 8లో



ఉత్కళ నూతన సంవత్సరం

ఉత్కళ నూతన సంవత్సరం ఘనంగా జరిగింది. పలు కార్యక్రమాలు నిర్వహించారు. - 8లో



కాంగ్రెస్‌లో చేరికలు

రాయగడలో కాంగ్రెస్‌లో పలువురు చేరారు. వీరిని సాదరంగా ఆహ్వానించారు. - 8లో

న్యూస్‌రీల్

గంజాయి అక్రమ రవాణా

● అన్నదమ్ములు అరెస్టు



గంజాయితో అరెస్టైన అన్నదమ్ములు

కొరాపుట్: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు అన్నదమ్ములను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో విశాఖపట్నం వెళ్లడానికి కిరండోల్ రైలు కోసం ఎదురుచూస్తున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగుల్లో తనిఖీలు చేపట్టగా 20 కేజీల గంజాయి పట్టుబడింది. వీరిద్దరూ జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన విశాల్ దుబే, భరత్ దుబేలుగా గుర్తించారు. వీరు సిమిలిగుడలో గంజాయి కొనుగోలు చేసినట్లు గుర్తించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బీఎస్‌ఎఫ్ జవాన్

కొరాపుట్: జిల్లా కేంద్రంలో బీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. శిబిరాన్ని బీఎస్‌ఎఫ్ సెక్టార్ కేంద్రంలో డీఐజీ సత్యవాన్ ప్రారంభించారు. గత 15 ఏళ్లుగా ఈ ప్రాంతంలో నక్సల్స్ వ్యతిరేక పోరాటంలో బీఎస్‌ఎఫ్ జవాన్లు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. వారి త్యాగాలు మరింత ముందుకు తీసుకొని వెళ్లడానికే రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. మొత్తం 50 మంది జవాన్లు రక్తదానం చేశారు.

జయపురం వచ్చిన అఖండ దీపం



జయపురం వచ్చిన అఖండ దీప రథం

జయపురం: హరిద్వార్ శాంతికుంజ్ గాయిత్రీ తీర్థం ద్వారా పరిక్రమిస్తున్న అఖండ దీపం రథం సోమవారం జయపురం చేరుకుంది. మల్కన్‌గిరి నుంచి జయపురం చేరిన అఖండ దీపానికి భక్తులు ఘన స్వాగతం పలికారు. హరిద్వార్ శాంతికుంజ్ గాయిత్రీ తీర్థంలో 1926లో ఏర్పాటు చేసిన ఈ అఖండ దీపం వెలుగుతూనే ఉంది. ఇది 2026 నాటికి వందేళ్ల పూర్తి చేసుకుంటుదని అఖండ దీప రథంతో సోమవారం జయపురం వచ్చినవారు తెలియజేశారు. అనంతరం నవరంగపూర్ మీదుగా కలహండి వెళ్తుందని వెల్లడించారు.

ముగిసిన గంగమ్మ తల్లి ఉత్సవాలు



అమ్మవారి ఘటంతో భక్తుడు

జయపురం: పట్టణంలోని గంగమ్మ తల్లి ఘటజాత్ర ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈనెల 7వ తేదీన పూర్ణఘడ్ గంగమ్మ మందిరం నుంచి అంచమాల తీసుకొని రావడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయని కమిటీ సభ్యులు తెలియజేశరాడు. ఆరోజు నుంచి అమ్మవారు భక్తుల నుంచి పెద్ద ఎత్తున పూజలందుకున్నారు.

100 కిలోల గంజాయి పట్టివేత



ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న గంజాయితో నిందితుడు, ఆటో

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా ఎక్సైజ్ పోలీసు అధికారి బింభధర్ పండా ఆదేశాలతో సోమవారం మల్కన్‌గిరి ఎక్సైజ్ పోలీసులు చలాన్‌గుడ పంచాయతీ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించారు. ఓ ఆటో అతివేగంగా రావడంతో ఆపి తనిఖీ చేయగా గంజాయి బస్తాలు కనిపించాయి. వెంటనే స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అరెస్టు చేశారు. వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నీలాపరి గ్రామానికి చెందిన ప్రశాంత్ ఖోరగా గుర్తించినట్లు తెలిపారు. గంజాయి తూకం వేయగా 100 కిలోలు వచ్చింది.



కొత్త బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే రూపేష్, ఎస్పీ జితేంద్రనాథ్ పండా



కొరాపుట్‌లో విజేతలకు బహుమతి అందిస్తున్న కలెక్టర్ వి.కీర్తివాసన్, పక్కనే జెడ్పీ ప్రెసిడెంట్ సస్మితా మెలక



కొరాపుట్‌లో నివాళులు అర్పిస్తున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, బీజేపీ కార్యకర్తలు

అంబేడ్కర్‌కు .. ఘనంగా నివాళి

పర్లాకిమిడి:

బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కొత్త బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, ఎస్పీ జితేంద్ర నాథ్‌పండా, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా, పురపాలక ఈఓ లక్ష్మణ ముర్ము, రాయగడ బ్లాక్ శిక్షాధికారి యస్.పాపారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టరేట్ నుంచి కొత్త బస్టాండు వరకూ మోటారు సైకిల్ ర్యాలీ జరిపారు. అనంతరం దండుమాలవీధిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

కొరాపుట్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా జరిగింది. సోమవారం కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలలో పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ పూలమాలాలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ చేసిన కృషిని వివరించారు. స్థానిక శిశు మందిర్ పాఠశాలలోనూ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధన్, జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, డీపీఐఆర్ఓ ప్రమిళ మాఝి, మున్సిపల్ అధికారి ఆశోక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



సిమిలిగుడలో ర్యాలీ చేస్తున్న పొట్టంగి ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం

రాయగడలో..

రాయగడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జిల్లా యంత్రాంగం పూలమాలలు వేసి నివాళులర్పించింది. జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ చంద్ర నాయక్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్, ఆ పార్టీ నాయకుడు యాల కొండబాబు, బసంత ఉలక, కాశీరాం మాఝి తదితరులు స్థానిక కొత్త బస్టాండు వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గుణుపూర్‌లో సీపీఐ (ఎంఎల్) జిల్లా అధ్యక్షుడు తిరుపతి గొమాంగొ ఆధ్వర్యంలో పట్టణలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.

జయపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు వాడవాడలా జరిగాయి. జయపురం సమితి జయంతిగిరి గ్రామంలో జయంతిగిరి కూడలి వద్ద గల అంబేడ్కర్ ప్రతిమకు పూల మాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. జయపురంలో దళిత సమాజ్ శ్రేణులు స్థానిక పారాబెడ కూడలిలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యా రెడ్డి, పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఆమెతో పాటు జయపురం ఎడిపిఆర్ఓ యశోద గదబ, పలువురు అధికారులు,జయపురం ప్రభుత్వ మహిళా కళాశాల, మహిళా ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, జయపురం అంబేడ్కర్ సమితి కార్యకర్తలు, బిజేపి నేతలు పారాబెడ కూడలి వద్దగల డా,అంబేడ్కర్ కు నివాళులు అర్పించారు.



కొరాపుట్‌లో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే రఘురాం మచ్చో



జయపురం: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన బీజేపీ శ్రేణులు



కొరాపుట్: పార్లమెంట్‌లో నివాళులు అర్పిస్తున్న కొరాపుట్ ఎంపీ



మల్కన్‌గిరి: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్



మల్కన్‌గిరి: సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో అంబేడ్కర్ జయంతిలో పాఠశాల విద్యార్థులు, అతిథులు



రాయగడ: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న అదనపు కలెక్టర్ నాయక్, బసంత్ తదితరులు

వైభవంగా హనుమాన్ జయంతి

రాయగడ: స్థానిక డైలీ మార్కెట్‌లో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ధ్యానాంజనేయ మందిరంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అభిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు జరిగాయి.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: ఒడియా వారికి నూతన సంవత్సరం వృషభ సంక్రాంతి, హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలో పలు ఆంజనేయస్వామి మందిరాలకు ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. స్థానిక గుండిచా మందిరం వద్ద పురాతన హనుమాన్ మందిరం వద్ద భక్తులు దీపారాధన చేసి అఖండదీపాలు వెలిగించారు. తెలుగు సొండి వీధి అభయాంజనేయస్వామి మందిరం వద్ద ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణంలో కేవుటి వీధి, బెత్తగుడ వద్ద ఆంజనేయస్వామి, గాజుల వీధిలో ఉచిత అన్నప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: కొరాపుట్,నబరంగ్‌పూర్ జిల్లాలలో హనుమాన్,రామ,బాలాజీ,శివ మందిరాలు కిటకిటలాడాయి. విశ్వ సంక్రాంతి సందర్భంగా రోడ్ల పై పానకాలు పంపిణీ చేస్తూ పాణ సంక్రాంతి జరుపుకున్నారు.



ధ్యానాంజనేయునికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



హనుమాన్ దేవాలయం దర్శనంలో నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి దంపతులు



జయపూర్ డైలీ మార్కెట్‌లో సామూహిక హనుమాన్ పూజలు చేస్తున్న తెలుగు ప్రజలు



గుండిచా మందిరం వద్ద పురాతన ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల దీపారాధన



జయపూర్ డైలీ మార్కెట్‌లో హనుమాన్‌ని దర్శించుకుంటున్న మాజీ మంత్రి రబినందో, శివ పట్నాయక్



బోయకొండపై వెలిసిన అభయాంజనేయ స్వామి

క్లుప్తంగా

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక కోర్సులు

శ్రీకాకుళం రూరల్: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులకు రాగోలు జెమ్స్ ఆస్పత్రి బొల్లినేని మెడిస్కిల్స్‌లో జీడీఏ, ఐసీయూ, ఓటీ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బీఎస్సీ డిప్లమా పారామెడికల్ నర్సింగ్ బీపీటీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మాజీ సైనికుల భవనానికి శంకుస్థాపన

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు పంచాయతీ రాయిపాడులో సైనిక్ భవన నిర్మాణానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం, కేంద్ర ప్రభుత్వం 50శాతం నిధులతో కలిపి రూ.2 కోట్ల 92 లక్షల నిధులతో ఈ భవనాన్ని నూతనంగా సైనిక్ భవన్‌గా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, సైనిక్ సంక్షేమ సంచాలకులు వెంకటరెడ్డి, ప్రెసిడెంట్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగించిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నగర పరిధిలోని డీసీసీబీ కాలనీలో భూసమేత వెంకటేశ్వర స్వామి ఆలయం, నర్సస్ కాలనీకి వెళ్లే రహదారి ఆక్రమణకు గురైన విషయం తెలిసిందే. ఆదివారం పలు ప్రజాసంఘాల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేయడంతో ఎట్టకేలకు మున్సిపల్ యంత్రాంగం దిగొచ్చింది. అధికారులు సోమవారం ఉదయం జేసీబీతో వెళ్లి ఆక్రమణలు తొలగించారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు.

శ్రీనివాస్‌కు సాహితీ లహరి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న చాడ శ్రీనివాస్

శ్రీకాకుళం కల్చరల్ : నగరానికి చెందిన ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు చాడ శ్రీనివాస్‌కు సాహితీ పురస్కారం దక్కింది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని సూర్యాపీఠం సమావేశ మందిరంలో సాహితీ లహరి, మంచిపల్లి సేవా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ డి.వి.జి.శంకరరావు, పక్కి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య



జి.ధర్మారావు(ఫైల్)

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ జి.ధర్మారావు (42)సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ధర్మారావు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద గొడవ పడి బయట కు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం పట్టణంలోని గొల్ల వాని చెరువు సమీపంలోని తోటలో ఆటో తాడుతో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతోభార్య మోహిని, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ లవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి స్టేట్ బ్యాంకు వెనుక ప్రకాష్ నగ ర్ కాలనీ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామానికి చెందిన కోరాడ వాసుదేవరావు(58) మృతి చెందాడు. విషయం తెలుసుకు న్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమారుడు పవన్‌కు సమాచారం అందించారు. వాసుదేవరావు ప్రకాష్‌నగర్‌లోనే ఉంటూ చిన్న చిన్న వంటపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోటబొమ్మాళి ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు.



జయపురం: పాణ సంక్రాంతిలో పూజలు అందుకుంటున్న దేవతా మూర్తులు



మల్కన్‌గిరి: జగన్నాథ మందిరం వద్ద ఒడియా వంటకాలను పరిశీలిస్తున్న అధికారులు



మల్కన్‌గిరి: మహిళలు చేసిన ఒడియా పిండివంటలను పరిశీలిస్తున్న అధికారులు



రాయగడ: పానకాన్ని పంచుతున్న దృశ్యం

ఘనంగా ఉత్కళ నూతన సంవత్సరం



రాయగడ: వైశ్య సంఘం ఒడియా ప్రజల కొత్త సంవత్సరం సందర్భంగా పూజాకార్యక్రమాలను నిర్వహించిన దృశ్యం

కొరాపుట్: ఉత్కళ ప్రజల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలలో ఉత్కళ కవులు, మేధావులు సదస్సులు, చర్చాగోష్ఠిలు ఏర్పాటు చేశారు.

రాయగడలో..

రాయగడ: ఒడియా ప్రజల కొత్త సంవత్సరం పాణా సంక్రాంతిని పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం కార్యాలయం ప్రాంగణంలో ప్రత్యేక పూజలను నిర్వహించి పాణా (పాణకం) ను పంపిణీ చేశారు. అదేవిధంగా వాకర్స్ క్లబ్, ఇంటర్‌నేషనల్ హ్యుమన్ రైట్స్ కౌన్సిల్ కు చెందిన సభ్యులు పాణాను పంపిణీ చేశారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో ఒడియా పక్షోత్సవాల్లో భాగంగా చివరి రోజు అయిన సోమవారం ఒడియా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ మాట్లాడుతూ పక్షోత్సవంలో చివరి రోజు మన ఒడియా నూతన సంవత్సరం కావడం విశేషమన్నారు. ఈ సందర్భంగా కొన్ని వంటకాలను ప్రదర్శించారు. స్థానిక జగన్నాథ మందిరంలో ఆదివారం ఆహార దినోత్సవం నిర్వహించారు.



కొరాపుట్: జయపూర్‌లో ప్రసంగిస్తున్న దేవేంద్ర బాహినీపతి, వేదిక పై శ్రీనివాస్ బాలారాయ్, తదితరులు



కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో ప్రత్యేక సంచికలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, వేదికపై జదేశ్వర్ ఖడంగా, కేదార్‌నాథ్ త్రిపాఠి

జయపురంలో..

జయపురం: ఒడియ సంప్రదాయ ప్రజల కొత్త సంవత్సరం పాణ సంక్రాంతిని ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ప్రతి ఇంటివారు దేవతలకు పూజలు భక్తి శ్రద్ధలతో జరిపారు.



జయపురం: ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

బీజేడీ జిల్లా అధ్యక్షుడిగా మనాస్ మాడ్కమి



బిజూ పట్నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మనాస్ మడ్కమి, నాయకులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బీజేడీ అధ్యక్షుడిగా ఐదోసారి మానాస్ మడ్కమిని ఆ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. స్థానిక భైరవ మందిరం వద్ద సోమవారం మానాస్ మడ్కమికి పార్టీ నాయకులు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట టున్న బిజూ పట్నాయక్ విగ్రహానికి నివాళుర్పించారు. మనాస్ మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానన్నారు. జిల్లాలోని గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు.



మానాస్ మడ్కమికి స్వాగతం పలుకుతున్న బీజేడీ నాయకులు

గవర్నర్‌ను కలిసిన మల్కన్‌గిరి ఎమ్మెల్యే



గవర్నర్‌తో భేటీ అయిన మల్కన్‌గిరి ఎమ్మెల్యే

మల్కన్‌గిరి: భువనేశ్వర్‌లో గవర్నర్ హరిబాబును మల్కన్‌గిరి ఎమ్మెల్యే సోమవారం కలిసి ఒడియా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఉన్న పలు గిరిజన తెగలకు అందాల్సిన సంక్షేమ పథకాలు గూర్చి చర్చించారు. వారి అభివృద్ధికి జిల్లాలో పర్యటించాలని ఆహ్వానించారు

మూడు ఇళ్లల్లో ఒకేసారి దోపిడీ

పర్లాకిమిడి: జిల్లాలో కాశీనగర్ సమితి గోరిబంద పంచాయతీ కురిగాం గ్రామంలో మూడు ఇళ్లల్లో ఆదివారం ఒకేసారి చోరీ జరిగింది. బంగారం, నగదు దోచుకున్నట్టు కాశీనగర్ ఐఐసీ సునీల్ కుమార్ బెహరా సోమవారం తెలియజేశారు. గోరిబంద పంచాయతీ ఖురిగాంలోని ఆర్.సావిత్రి ఇంట్లో రాత్రి దొంగలు పడి మహిళ మెడలో రెండు తులాల మంగళసూత్రం దోచుకున్నారు. బి.తవిటినాయుడు, పి.కళావతి ఇళ్లల్లో రూ.40 వేల నగదు, బంగారం దోచుకుని పారిపోయారు. దీనిపై కాశీనగర్ పోలీసు ఠాణా అధికారి సునీల్ కుమార్ బెహరా సంఘటనా స్థలానికి విచ్చేసి దర్యాప్తు జరుపుతున్నారు. దీనిపై కాశీనగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: జేకేపూర్ రోడ్డుకు వెళ్లే మార్గంలో గల రిలయన్స్ మార్ట్ వద్ద స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బాటసారులకు తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ కుమార్, కె.రమేష్, కె.ధర్మరాజు, తదితరులు ప్రారంభించారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దీనిని ఏర్పాటు చేయడం జరిగిందని క్లబ్ సభ్యులు తెలిపారు.

సామాజిక న్యాయమే లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్: సామాజిక న్యాయమే లక్ష్యంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ముందుకు సాగారని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఐసీఎస్ఎస్ఆర్ (ఎస్ఆర్‌సీ) హానరీ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోమవారం 'విస్మరించబడిన వర్గాలకు సాధికారిత' అనే అంశంపై రెండు రోజుల సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ మార్గం అనుసరణీయమన్నారు. ప్రపంచ మేధావుల్లో అంబేడ్కర్ అగ్రస్థానంలో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో వీసీ రజిని, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక మండపాలం కాలనీ సమీపంలో పాత జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చేరీవీధికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు జి.సింహాద్రి సైకిల్‌పై మండపాలం కాలనీ నుంచి తన వీధి వైపు వెళ్తుండగా వెనుక నుంచి బొలెరొ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సింహాద్రికి తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న జవాన్లకు అభినందిస్తున్న అడిషనల్ ఎస్పీ తాపాన్ నారాయణ్ రోథో

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి ఓఎస్ఏపీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా పోలీస్ యంత్రాంగం తరఫున సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ ఎస్పీ తపాన్ నారాయన్ రోథో హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఎస్ఎఫ్ జవాన్లు, జిల్లా పోలీసులు రక్తదానం చేశారు. 103 యూనిట్లు రక్తం సేకరించి జిల్లా రెడ్ క్రాస్‌కు అందజేశారు. జిల్లా పోలీసు అధికారులు, వైద్యులు సుర్మా బెహరా, రెడ్‌క్రాస్ వైద్యులు సాగర్ బాల, సిబ్బంది పాల్గొన్నారు .

షైన్ అవార్డులకు సిక్కోలు విద్యార్థులు



దామోదర స్వప్న



ఎ.సేవేంద్రకుమార్



కర్ని ధరణి

శ్రీకాకుళం న్యూకాలనీ : సిక్కోలు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అదరహో అనిపించి స్టేట్ అవార్డులకు ఎంపికయ్యారు. వివిధ ప్రభుత్వ యాజమాన్య విద్యాసంస్థల్లో చదువుతూ టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు షైన్ అవార్డులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపికచేసింది. శ్రీకాకుళం జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. టాపర్లను ఈ నెల 14, 15 తేదీల్లో విజయవాడ/గుంటూరులో సత్కరించేలా ఏర్పాట్లు చేసింది. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని దామోదర స్వప్న ఎంపీహెచ్‌డబ్ల్యూ ఒకేషనల్ కోర్సులో 1000 మార్కులకు 989 మార్కులతో రాష్ట్రంలో టాపర్‌గా నిలిచింది. ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్, అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రాణించింది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థిని ఎ.సేవేంద్రకుమార్ సీజీఏ ఒకేషనల్ కోర్సులో 1000 మార్కులకు 958 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ప్రిన్సిపాల్ పి.దుర్గారావు, అధ్యాపకులతో నిరంతరం ప్రోత్సాహంతో రాణించింది. బూర్జ మండలం ఓవీ పేట మోడల్ స్కూల్ విద్యార్థిని కర్ని ధరణి ఎంపీసీ జనరల్ కోర్సులో 1000 మార్కులకు 984 మార్కులు సాధించి శభాష్ అనిపించింది. ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, తల్లిదండ్రులు, పీజీటీల ప్రేరణ మరువలేనిదని చెబుతోంది.

వంట బిల్లులు వెంటనే చెల్లించాలి



లావేరులో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు, వంట కార్మికులు

ఎచ్చెర్ల : మధ్యాహ్న భోజనం పథకం వంట కార్మికులకు పది వేల రూపాయల వేతనం, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ మధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర డిమాండ్‌చేశారు. మండల కేంద్రం లావేరులో సోమవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ముందుగా స్కూల్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు రూ.3 వేల జీతంతో నెట్టుకొస్తున్నారని చెప్పారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలు పెరుగుతున్నా వేతనాలు, మెనూ చార్జీలు మాత్రం పెరగడం లేదన్నారు. ప్రాథమిక విద్యార్థులకు రూ.6.12 పైసలు, హైస్కూల్ విద్యార్థులకు రూ.9.29 పైసలతో నాణ్యమైన పౌష్టికాహారం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఒక్కో విద్యార్థికి మెనూ చార్జీ రూ.20కు పెంచాలని కోరారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం, మౌలిక సదుపాయాలని కల్పించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరినవారితో పీసీసీ అధ్యక్షుడు దాస్, ఎమ్మెల్యే గొమాంగొ

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితిలో గల పలువురు బీజేడీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి సోమవారం చేరారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్‌దాస్ సమక్షంలో చేశారు. జిల్లాలోని గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండా తదితరుల సమక్షంలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో పద్మపూర్ సమితి మాజీ చైర్మన్ రమాకాంత్ మాఝి, సర్పంచ్ అగాదు సబర్, జుగల్ మాఝి, రాజేష్ సబర్, డొంబురు సుంద్రుక తదితర ప్రముఖులు ఉన్నారు.

ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు దాస్ వారిని పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. భవిష్యత్‌లో పార్టీ అభివృద్ధికి కలసి కట్టుగా కృషి చేయాలన్నారు.

బ్రిటిష్ పాలకులు క్షమాపణ చెప్పాలి



ప్రసంగిస్తున్న కమ్యూనినిస్టు నేత

జయపురం: జలియన్ వాలాబాగ్ దుర్ఘటనకు బ్రిటిష్ పాలకులు ఇండియాకు క్షమాపణ చెప్పాలని ప్రముఖ కార్మిక నేత, రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యులు ప్రమోద్ కుమార్ మహంతి డిమాండ్ చేశారు. జలియన్‌బాగ్ సంఘటన దినం సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక యాదవ భవనంలో నిర్వహించిన స్మృతి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడితేనే బీసీలకు రాజ్యాధికారం



ఐక్య నినాదం చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా బీసీలు బతుకులు అగ్రకుల పెత్తందారుల కబంధహస్తాల మధ్యనే నలిగిపోతున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అన్నారు. బీసీలు రాజ్యాధికారం సాధించే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఏ ఉద్యమానికైనా శ్రీకాకుళం జిల్లా నుంచే శ్రీకారం చుడితేనే విజయవంతమవుతుందన్నారు. శ్రీకాకుళం నగరంలో బీసీ నాయకులతో కలిసి ఓ ప్రయివేటు భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ బీసీ వ్యక్తి ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే రూ.25 నుంచి రూ.100 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కుటుంబ రాజకీయాలకు స్వస్తి చెప్పి బీసీలకు న్యాయం చేసే పాలకుల్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఐక్యతగా ఉంటేనే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని, లేకుంటే జీవిత కాలం అగ్రకులాల చేతుల్లో కీలు బొమ్మల్లా ఉండిపోవాల్సి వస్తుందన్నారు. త్వరలో విజయవాడలో బీసీలందరితో కలిసి సభ ఏర్పాటుచేస్తామని చెప్పారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు కిల్లాన శ్రీనివాసరావు, ఆవు నరసింహరావు, ఎంఏ బేగ్, గద్దిబోయిన కృష్ణయాదవ్, నర్తు నరేంద్రయాదవ్, బి.రాజేష్, బాడాన దేవభూషణ్, గురునాథ్‌యాదవ్, కిల్లాన మాధవరావు, కిల్లాన దిలీప్, నాగేశ్వరరావు, లక్ష్మి, పి.రామకృష్ణ, కలగ కేశవరావు, శాలిన లక్ష్మణరావు, అలపాన త్రినాథరెడ్డి, వాన కృష్ణచంద్, ఆగూరు ఉమామహేశ్వరరావు, బి.సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



రణస్థలంలో ఫైర్ స్టేషన్ వద్ద సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 20 వరకు వారోత్సవాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహన్‌రావు, రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్, జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు. -రణస్థలం

క్లుప్తంగా

రెడ్‌క్రాస్ సొసైటీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు-1(డీఎంఎల్‌టీ లేదా బీఎస్సీ ఎంఎల్‌టీ, అకౌంటెంట్ పోస్టు-1(ఏదైనా డిగ్రీ, టాలీ అనుభవం ఉండాలి), జన ఔషధి మెడికల్ షాపులో ఫార్మసిస్ట్ పోస్టు-1(బి.ఫార్మసీ లేదా డి.ఫార్మసీ విద్యార్హత)కు అర్హత గల అభ్యర్థులు ఈనెల 21 వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 08922-272700, 9493092700, 6305042755 లను సంప్రదించాలని సూచించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు


రాహుల్ పండిత్


పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం పరిధిలో ఓలేటి వారి ఫారం సమీపంలో నివాసం ఉంటున్న రాహుల్ పండిత్ అనే యువకుడు ఆదివారం సాయంత్రం నుంచి ఆచూకీ లేవకపోవడంతో తండ్రి ముఖేష్ పండిత్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి తెలిపారు.

చికిత్స పొందుతూ వీఆర్‌ఏ మృతి


వెంకటాపురం వీఆర్‌ఏ నాగయ్య (ఫైల్)

సీతానగరం: మండలంలోని వెంకటాపురం(కామందొరవలస)రెవెన్యూ గ్రామానికి చెందిన వీఆర్‌ఏ తోట నాగయ్య విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 8 గంటలకు మృతిచెందాడు. దీనిపై స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. గతనెల 16న ఇంట్లో చెదలు నివారణకని తెచ్చి ఉంచిన చెదల నివారణ మందును వీఆర్‌ఏ నాగయ్య యాదృచ్ఛికంగా తాగాడు. చెదల నివారణమందు తాగినట్లు గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా నాటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 8 గంటలకు మృతిచెందినట్లు తెలియజేశారు. సోమవారం వీఆర్‌ఏ తోట నాగయ్య మృతిచెందినట్లు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రాజేష్ కేసు నమోదుచేసి మృతదేహానికి పోస్టుమార్టం చేసినట్లు తెలియజేశారు. మృతుడు నాగయ్య అంత్యక్రియల నిమిత్తం తహసీల్దార్ ప్రసన్నకుమార్ ఆదేశాలమేరకు ఆర్ఐ నాగి రెడ్డి శ్రీనివాసరావు, వీఆర్వో బాబూరావు రూ.10వేలు కుటుంబసభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. నాగయ్య కుటుంబాన్ని సచివాలయ ఉద్యోగులు పరామర్శించి సానుభూతి వెలిబుచ్చారు.

ఆకట్టుకొన్న అంబేడ్కర్ నఖచిత్రం



గరుగుబిల్లి: మండలంలోని నాగూరుకు చెందిన చిత్రకారుడు పల్ల పరిశినాయుడు అంబేడ్కర్ జయంతి సందర్భంగా వేసిన అంబేడ్కర్ నఖచిత్రం చూపరులను ఆకట్టుకుంది. ప్రశంసలు అందించింది.

కళ్లికోటలో గజరాజులు


కళ్లికోట-గారవలస గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న గజరాజులు

కొమరాడ: ఇటీవల జియ్యమ్మవలస మండలంలో సంచరించిన ఏనుగులు పాతదుగ్గి మీదుగా సోమవారం కళ్లికోట గ్రామానికి చేరుకున్నాయి. కళ్లికోట, గారవలస, దుగ్గి గ్రామాల రైతులు రాత్రి సమయంలో పొలాల్లోకి వెళ్లవద్దని అటవీశాఖ సిబ్బంది హెచ్చరికలు జారీ చేశారు. ఏనుగుల గుంపు కనిపిస్తే కవ్వింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. ఏనుగుల సంచారంతో జొన్న, కూరగాయల పంటలు నాశనమవుతున్నాయంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం అందజేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

పన్ను వసూలులో నిర్లక్ష్యం..!

- పంచాయతీల్లో పడకేసిన ప్రగతి
- వసూలులో వెనుకబడిన అధికారులు
- బకాయి రూ.కోట్లలోనే..


కొండకెంగువలో శిథిలావస్థలో ఉన్న కల్వర్టు, మురుగు నీటి కాలువ


రామభద్రపురం యాత వీధిలో మురుగుతో నిండిన కాలువ

రామభద్రపురం: పంచాయతీల్లో ఇంటి పన్ను, ఆస్తి పన్ను వసూలు విషయంలో అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది.ఫలితంగా ఆయా పంచాయతీలు ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటుండడంతో పల్లెల్లో ప్రగతి పూర్తిగా పడకేసింది. గ్రామాల్లోని గృహాలు, ఖాళీస్థలాలు, వాణిజ్య, వ్యాపార సముదాయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల ద్వారా మార్చి 31 నాటికి నూరు శాతం పన్నులు వసూలు చేస్తామని అధికారులు ప్రకటించినా లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేదు.

ఇంటి పన్నుల వసూలు ఇలా..

జిల్లాలో 777 పంచాయతీలు ఉన్నాయి. వాటిలో మార్చి 31 నాటికి 2023-24 ఏడాదికి సంబంధించి ఇంటి పన్నులు పాతబకాయి రూ.3,31,52,718 కాగా, 2024-25 ఏడాదికి వసూలు చేయాల్సింది. రూ. 15,76,14,332. మొత్తంగా రూ. 19,07,67,050 లు వసూలు లక్ష్యం ఉంది. అయితే ఇందులో పాత బకాయి రూ.2,66,11,654లు, ఈ ఏడాది రూ.13,40,20,752లు వసూలు చేశారు.మొత్తంగా రూ.16,06,32,406 వసూలైంది. ఇంకా పాత బకాయిలు రూ.65,41,064లు, 2024-25 ఏడాది వసూలు చేయాల్సింది రూ.2,35,93,584 బకాయి ఉంది. మొత్తంగా రూ.3,01,34,644లు బకాయి ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

పడకేసిన ప్రగతి..

పంచాయతీ ఖజానాలో పైసా లేక ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. నిధులు లేక వాటిలో ప్రగతి పనులు పడకేశాయి. తాగునీటి పథకాల నిర్వహణతో పాటు వీధిదీపాలు, పారిశుద్ధ్యం నిర్వహణకు సొమ్ములేదు. దీంతో గ్రామకార్యదర్శులు, సర్పంచులు గ్రామాల్లో పనులు చేయించుకోలేకపోతున్నారు. వీధుల్లో రోడ్లు, మురుగుకాలువల నిర్మాణాలకు నిధులు లేవు.నీటి పథకాలను అతికష్టం మీద నిర్వహిస్తున్నారు. మోటార్లు కాలిపోతే రూ.వేలల్లో ఖర్చువుతుంది. ఆ సొమ్మును సర్పంచులే భరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి గ్రాంట్లు వస్తే వాటిలో బిల్లు చేసుకోవాలన్న ఆశతో సొంత సొమ్మును ఖర్చు పెడుతున్నారు. మారుమూల గ్రామాల్లో వీధి దీపాలు కూడా వెలగడం లేదని, పండగలకు మాత్రమే వీధి దీపాలు వెలుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.


వీధిలో సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని చూపుతున్న నేరళ్లవలస గిరిజన ప్రజలు

ఆస్తి పన్ను వసూలు ఇలా..

అలాగే పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరులైన మార్కెట్ వేలం, చేపల చెరువులు, దుకాణాలు, చేపల చెరువుల లీజులు, సంతలు, సెల్‌టవర్స్ తదితర ఆస్తి పన్నులు 2023-24 ఏడాది పాత బకాయిలు రూ.1,65,42,853లు, 2024-25 ఏడాది వసూలు చేయాల్సింది రూ.3,25,95,344 ఉండగా, మొత్తంగా 4,91,38,197 వసూలు లక్ష్యం ఉంది. ఇందులో పాతబకాయి రూ.95,09,074లు, ఈ ఏడాది రూ.2,57,44,030లు వసూలు చేశారు.మొత్తంగా రూ.3,52,53,104 వసూలైంది.ఇంకా పాత బకాయిలు రూ.70,33,779లు, ఈ ఏడాది వసూలు చేయాల్సింది రూ.68,51,314 బకాయి ఉంది. మొత్తంగా రూ.1,38,85,093లు బకాయి ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.అయితే మార్చి 31 అర్ధరాత్రి నుంచి ఆస్తిపన్నుకు సంబంధించి ప్రభుత్వ వెబ్‌సైట్ నిలిపివేసినట్లు తెలిసింది.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ఆర్థిక సంవత్సరం వివరాలు అప్‌డేట్ అయిన తర్వాత వెబ్‌సైట్ మళ్లీ అందుబాటులోకి రానుందని సమాచారం.

కాళ్లరిగేలా తిరిగినా సీసీ రోడ్డు వేయరు



ప్రతి నాయకుడి దగ్గరికి కాళ్లరిగేలా తిరిగినా మా వీధిలో సీసీ రోడ్డు వేయడం లేదు. ఏళ్లగా బుగ్గి, బురదలోనే తిరుగుతున్నాం. ఎన్నికల సమయంలో వచ్చిన పెద్ద నాయకుల దృష్టిలో కూడా పెట్టాం. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పడమే కానీ చేయడం లేదు. ఇకనైనా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– బోయిన బాలరాజు, నేరళ్లవలస, జన్నివలస

పన్నులు వదిలే ప్రసక్తి లేదు..

గ్రామాల్లో ప్రజల నుంచి ఇంటి పన్నులు, ఆస్తి పన్నులు రాబడతాం. వదిలే ప్రసక్తి లేదు.త్వరలో వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తుంది. పన్ను వసూళ్లపై ప్రచార మాధ్యమాల ద్వారా, అలాగే సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ పంపించి పక్కా ప్రణాళికతో వసూలు చేస్తాం. ఆస్తి పన్ను చెల్లింపులో ఇప్పుడు 50 శాతం రాయితీ వర్తిస్తుంది. పన్నులు వసూలైతేనే ప్రగతి పనులకు నిధుల కొరత లేకుండా ఉంటుంది.

– వెంకటరమణ, ఈవోపీఆర్డీ, రామభద్రపురం

మృత్యుంజయుడు పింటూ

- ఏనుగుల దాడి నుంచి క్షేమంగా బయటకు


బత్తిలి ఎస్సై అనిల్ కుమార్‌తో బాధితుడు పింటూ సాంత్రో

భామిని: ఏనుగుల ఘీంకారంతో దిక్కులు పిక్కటిల్లుతున్న సాయం సంధ్యా సమయం, మరో వైపు భామిని మండలం సింగిడి గ్రామానికి చెందిన పింటూ ఏనుగులకు చిక్కాడన్న ప్రచారంతో ప్రజల పరుగులు..ప్రమాద స్థలానికి వెళ్లడానికి ప్రజలకు ధైర్యం చాలడం లేదు. ఏనుగులు కనిపిస్తూనే ఉన్నాయి. ఏనుగులకు అరటిగెల ఇవ్వడానికి వెళ్లిన పింటూ సాంత్రో వాటికి దొరికి పోయాడనే ప్రచారం ఊపందుకుంది. మరో పక్క సింగిడి, బిల్లుమడ, నులకజోడు గ్రామస్తులతో రోడ్డంతా నిండిపోయింది. చివరికి సోమవారం సాయంత్రం పింటూ బయటపడడంతో ప్రజల్లో ఆందోళన తగ్గింది. మృత్యుంజయుడిగా పింటూ సాంత్రో బయటకు రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఏనుగుల దాడిలో పింటూ చిక్కుకుని తప్పించుకునే క్రమంలో బురదలో పడిపోయి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ విషయాన్ని బత్తిలి ఎస్సై డి.అనిల్ కుమార్ అటవీ సిబ్బందితో కలిసి పింటూ సాంత్రోను ప్రజల ముందుపెట్టి వెల్లడించి సింగిడి గ్రామస్తులకు అప్పగించారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామానికి చెందిన బోనెల లచ్చయ్య(79) శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని హెచ్‌సీ వి.జనార్దనరావు తెలిపారు. వివరాలలోకి వెళ్తే..లచ్చయ్య ఈ నెల 12వ తేదీన చెరువుకు స్నానం చేయడానికి వెళ్లి బయటకు కనబడని దెబ్బలతో చెరువుగట్టుపై పడిపోవడంతో కుటుంబసభ్యులు శ్రీకాకుళం లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం చనిపోయాడు. దీంతో ఆస్పత్రి సిబ్బంది ఎంఎల్‌సీ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. లచ్చయ్య మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేశామని తెలియజేశారు.

ఆరు ఇళ్లు దగ్ధం

- ఆహుతైన రూ.5 లక్షల నగదు, బంగారం


కాలిపోయిన ఇళ్లు


ఆహుతైన నగదు

పూసపాటిరేగ: మండలంలోని పతివాడ పంచాయతీ మధుర గ్రామం కామునాయుడు పేటలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఆరు ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.5 లక్షల నగదు, బంగారం, గృహోపకరణాలు కాలిపోయినట్లు బాధితులు వాపోయారు.అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. కామునాయుడు పేట గ్రామంలో రీసు రామస్వామి ఇంటి నుంచి మంటలు వ్యాపించాయి. సమీపంలో గల రీసుసూరి, రీసు అప్పన్న, గులివిందల లక్ష్మప్పడు, గులివిందల కామునాయుడు, కిలారి సూర్యనారాయణ ఇళ్లకు మంటలు అంటుకోగా దగ్ధమయ్యాయి. రీసు సూరి ఇంట్లో శుభకార్యం నిమిత్తం అప్పు చేసి తీసుకువచ్చిన రూ.5లక్షలు అగ్నికి ఆహుతైనట్లు బాధితులు లబోదిబోమన్నారు. కాలిపోయిన ఇళ్లను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ప్రభుత్వం నుంచి మంజూరుకావాల్సిన సహాయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పశువుల రవాణాను అడ్డుకున్న పోలీసులు


వాహనాలను సీజ్ చేసి డ్రైవర్లను విచారణ చేస్తున్న ఎస్సై నవీన్‌పడాల్

లక్కవరపుకోట: అక్రమంగా వాహనాల్లో పశువులను కుక్కి తరలిస్తున్న వాహనాలను ఎల్.కోట ఎస్సై నవీన్‌పడాల్ తన సిబ్బందితో కలిసి సోమవారం అడ్డుకున్నారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జామి మండలం అలమండ గ్రామం సంతనుంచి నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాల్లో అధిక పశువులను ఎక్కించి రవాణా చేస్తున్న వాహనాలను భీమాళి జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. 2 వాహనాల్లో పశువులను తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాలతో పాటూ పశువులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి పశువులను సమీపంలో గల గోశాలకు తరలించారు. ఈ మేరకు రెండు వాహనాలను సీజ్ చేసి సంబంధిత డ్రైవర్లను విచారణచేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కరెంట్ పోల్‌పై తిరగబడ్డ జేసీబీ

సాలూరు రూరల్: మండలంలోని కొదమ పంచాయతీ అడ్డుగూడ, కోడంగివలస గ్రామాల మధ్యలో ఘాట్‌రోడ్డు వద్ద ఆదివారం రాత్రి ట్రాలీపై తీసుకువెళ్తున్న జేసీబీ తిరగబడి పక్కనే ఉన్న కరెంట్ పోల్‌పై పడింది. దీంతో ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

గంజాయి తరలింపు కేసులో ఆరో నిందితుడి అరెస్ట్


గంజాయి తరలించిన కేసులో పట్టుబడిన ఆరో నిందితుడిని అరెస్ట్ చేసిన వివరాలు తెలియజేస్తున్న బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు

తెర్లాం: గంజాయి తరలిస్తుండగా పట్టుబడిన కేసులో ఆరో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, తెర్లాం ఎస్సై సాగర్‌బాబు సోమవారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వారు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. 2024లో రెండు కార్లలో 18.2 కేజీల గంజాయిని రామభద్రపురం నుంచి రాజాం తరలిస్తుండగా తెర్లాం జంక్షన్ వద్ద స్థానిక పోలీసులు పట్టుకున్నారు. అప్పట్లో వారి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, రెండు కార్లను సీజ్ చేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అదే కేసులో మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. ఈ కేసుకు సంబంధించి ఒడిశా రాష్ట్రంలోని పొట్టంగి మండలం ఘూడిగూడకు చెందిన ఆరో నిందితుడు రామభద్రపురం బైపాస్ వద్ద ఆదివారం రాత్రి సంచరిస్తుండగా తెర్లాం పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ఐదవ వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. గంజాయి కేసును ఛేదించేందుకు కృషిచేస్తున్న ఎస్సై సాగర్‌బాబు, సిబ్బందిని సీఐ నారాయణరావు అభినందించారు.

ముగిసిన జిల్లా స్థాయి టెన్నిస్ చాంపియన్‌షిప్


జిల్లా స్థాయి టెన్నిస్ చాంపియన్ షిప్ విజేతలు

విజయనగరం: విజయనగరం సిటీ క్లబ్ ఆవరణలో రెండురోజుల పాటు కొనసాగిన జిల్లా స్థాయి పోటీలు ఆద్యంతం ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగి సోమవారం ముగిశాయి. ఈ పోటీల్ల క్రీడాకారులు ఉత్తమమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఐదు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో దాదాపు అరవై మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 12, అండర్ 16, అండర్ 30, 40, 50 విభాగాల్లో పోటీలకు సిటీ క్లబ్ ఆతిథ్యం ఇచ్చింది. క్రీడాకారుల నుంచి ఎటువంటి ఎంట్రీ ఫీజ్ వసూలు చేయకుండా వారిని ప్రోత్సహించేందుకు నిర్వాహకులు టెన్నిస్ పోటీలు నిర్వహించి విజేతలకు చాంపియన్ షిప్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విజయనగరానికి టెన్నిస్ క్రీడకు ఉన్న సంబంధాన్ని అంతా మననం చేసుకున్నారు. ప్రతి ఏడాది దివంగత నారాయణ దొర, ముద్దుబాబు, బాబ్జీలు జాతీయస్థాయి పోటీలను క్రమం తప్పకుండా నిర్వహించేవారని గుర్తుచేశారు. వారి స్ఫూర్తితో సిటీ క్లబ్ అధ్యక్షుడు రంగబాబు, జాతీయ టెన్నిస్ మాజీ కోచ్ సన్నిబాబు, శ్రీను, శివాజీల చొరవతో ఈ ఏడాది జిల్లాస్థాయి టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించామని వైభవ్, సాత్విక్, కౌశిక్ కోచ్ గౌరీశంకర్, రామారావు పోటీల ముగింపు కార్యక్రమంలో తెలిపారు. త్వరలో మరిన్ని పోటీలను నిర్వహిస్తామన్నారు. అతి తక్కువ ఫీజ్ తో సిటీ క్లబ్ ఆవరణలో టెన్నిస్ శిక్షణ ఇస్తున్నామని చిన్నారులు ఈ అవకాశం వినియోంచుకోవాలని కోచ్ గౌరీశంకర్ తెలిపారు.

మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా గోవిందరావు బాధ్యతల స్వీకరణ


ఎస్పీ వకుల్ జిందల్‌ను కలిసిన మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రమంతటా ఉన్న దిశ మహిళ పోలీస్‌స్టేషన్‌లను మహిళా పోలీస్‌స్టేషన్‌లుగా మార్చిన సంగతి విదితమే. విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌కు రెండో డీఎస్పీగా ఆర్.గోవిందరావు సోమవారం బాధ్యతులు చేపట్టారు. అనంతరం నేరుగా ఎస్పీ ఆఫీస్‌కు వెళ్లి ఎస్పీ వకుల్ జిందల్‌ను కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. అలాగే స్టేషన్ కు వచ్చిన ప్రతి బాధితురాలి బాధను అర్థం చేసుకుని కేసు నమోదు చేసేలా ప్రవర్తించాలని చెప్పారు. ఇక మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గోవిందరావు 1991లో డిపార్ట్‌మెంట్‌లో చేరి జిల్లాలోని ఎస్.కోట, డెంకాడ, సబ్ మెరైన్, విజయనగరం రూరల్ ఎస్సైగా పనిచేశారు. ఇటీవలే విజయనగరం డీఎస్పీగా పనిచేసిన అనంతరం మహిళా స్టేషన్ డీఎస్పీగా తాజాగా బాధ్యతలు చేపట్టారు.

వీఆర్‌ఏలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించండి

- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన వీఆర్‌ఏల సంఘం యూనియన్ నాయకులు

విజయనగరం గంటస్తంభం: వీఆర్‌ఏలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి కోరారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయడంతో పాటు తమ ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు వీఆర్‌ఏలు స్థానిక కలెక్టరేట్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ రెవెన్యూ సహాయకులుగా పైకి విధులు నిర్వహిస్తున్నా వారు అంతర్గతంగా ఆఫీస్ కార్యాలయాల్లో అటెండర్లుగా, స్వీపర్లుగా, డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారన్నారు. అటువంటి వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. అలాగే అర్హులైన వారికి ప్రమోషన్, నైట్‌డ్యూటీల రద్దు, జీతంతో కలిపి డీఏలు, భూసర్వేల సందర్భంగా టీఏ, డీఏలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ప్రసాద్, పైడిరాజు, సన్యాసప్పుడు, రామప్పుడు, జయరావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

దళిత అభ్యున్నతే అంబేడ్కర్ ఆశయం

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి


అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాలు అర్పిస్తున్న గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: దేశాభివృద్ధికి దళిత అభ్యున్నతే మూలమని, దానినే ఆశయంగా బాబాసాహెబ్ అంబేడ్కర్ చేసుకున్నారని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. భారతరత్న అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు యూనివర్సిటీ ప్రాంగణంలో సోమవారం ఘనంగా జరిగాయి. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాల్లో అన్నింటికన్నా ఉత్తమమైన భారత దేశ రాజ్యాంగాన్ని రచించిన ఘనత అంబేడ్కర్‌కు దక్కిందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, డాక్టర్ గంగునాయుడు మండల, డాక్టర్ కుసుమ్, సుప్రియదాస్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీలో..

అండ్కర్ జయంతి ఉత్సవాలు స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో సోమవారం వేడుకగా జరిగాయి. స్థానిక యూనివర్సిటీ ప్రాంగణంలో అంబేడ్కర్ చిత్రపటానికి యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయనగరంలో క్రికెట్ బెట్టింగ్‌ల జోరు

- ఏడుగురిపై కేసు నమోదు


క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసిన విజయనగరం వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, చిత్రంలో ఏఎస్సై సత్యం

విజయనగరం క్రైమ్: ఐపీఎల్ జరుగుతున్న వేళ ప్రతిచోటా క్రికెట్ బెట్టింగ్ లు జరుగుతూనే ఉన్నాయి. అయితే క్రికెట్ బెట్టింగ్‌లపై అన్ని స్టేషన్ల హౌస్ ఆఫీసర్లకు సెట్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాచారం తెలిసిన వెంటనే కేసులు నమోదు చేయాలని సోమవారం ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాస్ సూచనలతో విజయనగరం వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తన బృందంతో కలిసి దాడి చేసి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న స్థానిక ఉల్లి వీధికి చెందిన బుర్లి వాసును పట్టుకుని విచారణ చేయగా ఆ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో శేఖర్, శ్రీను, అప్పలరాజు, నారాయణరావు, ఓబుల్‌రెడ్డి, గోల్డ్ శ్రీనులపై కేసు నమోదు చేశారు.

ఆటో ఢీకొని యువకుడికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన గణేష్


ప్రమాదంలో గాయపడిన లక్ష్మి

గంట్యాడ: విజయనగరం మండలం కోరుకొండపాలెం గ్రామానికి చెందిన యువకుడు నొడగల గణేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గణేష్ బైక్‌పై గంట్యాడ మండలం పెదవేమలి వైపు వస్తుండగా గంట్యాడ మండలం మురపాక నుంచి ఎదురుగా వస్తున్న ఆటో పెదవేమలి, కోరుకొండపాలెం మధ్య గెడ్డ సమీపంలో బైక్‌ను ఢీకొట్టడంతో గణేష్ కింద పడిపోగా కాలు విరిగిపోయింది. స్థానికులు 108 అంబులెన్సులో విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని మహిళకు..

సీతానగరం: మండలంలోని జాతీయరహదారిలో సోమవారం రాత్రి అంటిపేట వద్ద రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఓ మహిళ గాయాల పాలైంది. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంటిపేట ప్రజలకు కూడలిగా ఉండే రావిచెట్టు సమీపంలో గాడి లక్ష్మి రోడ్డు దాటుతుండగా బొబ్బిలి మండలం అప్పయ్యపేట గ్రామానికి చెందిన మోటార్ సైకిలిస్ట్ సీతానగరం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా లక్ష్మిని ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. గాయాలపాలైన ఆమెను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.